ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



25న జాబ్‌మేళా



ఉరవకొండ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామ సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 25న జాబ్ మేళా నిర్వహిస్తున్న ట్లు ప్రిన్సిపాల్ అస్రఫ్అలీ ఆదివారం ఒక ప్రకట నలో పేర్కొన్నారు. ఈ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ వరకూ చదివిన వారు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగం పొందిన తర్వాత బెంగళూరు, పెనుకొండ, అనంతపురంలో పనిచేయాల్సి ఉంటుందని అన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌ఫోన్ నెంబర్లు.. 7013800115, 6304426349 సంప్రదించవచ్చు అన్నారు.

ఉత్సవ శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి వేడుకలు

ముస్తాబైన అమ్మవారి ఆలయాలు



శంకరమఠంలో జగత్ప్రసూతిక అలంకరణలో దర్శనమిస్తున్న శారదామాత



విద్యుద్దీపాలంకరణలో కొత్తూరు అమ్మవారిశాల

అనంతపురం టౌన్, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): హిందువుల ప్రధాన పండుగల్లో ఒకటైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభ మవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా అమ్మవారి ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. ఆలయాలను విద్యుద్దీపాలంకరణలు, నూతన రంగులతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

శారదామాతకు అలంకరణ

శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలో ఆదివారమే దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు చేశారు. జగత్ప్రసూతికగా అలంకరించి, విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

నవరాత్రులను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో సోమవారం నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి ప్రకటనలో వెల్లడించారు. శ్రీవారికి రోజూ సాయంత్రం వాహనసేవలు నిర్వహిస్తామన్నారు. అక్టోబరు 3న స్వామివారి చక్రస్నానంతో వేడుకలు ముగుస్తాయన్నారు.

ఆర్డీటీకి అభయం

సేవలు కొనసాగుతాయని మంత్రి లోకేశ్ భరోసా



మంత్రి నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాంచో ఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ అభయమిచ్చారు. అమరావతిలో ఆదివారం మంత్రిని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ మర్యాద పూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్డీటీ లక్షలాది పేదల బతుకుల్లో వెలుగులు నింపిన ఆశాకిరణం అని కొనియాడారు. అలాంటి సంస్థకు ఏర్పడిన తాత్కాలిక ఇబ్బందులను పరిష్కరించి, సేవలు నిరంతరాయంగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేంద్రంతో ఇదివరకే సంప్రదింపులు జరిపామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఆర్డీటీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదనీ, ఆర్డీటీ సేవలు యథాతథంగా కొనసాగుతాయని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు.



ఉచిత శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహించే ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి వెంకటేష్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23న ఆత్మకూరు మండలం సిద్దరాంపురం, 27న బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లి, 30న గుత్తి మండలం తొండపాడులో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.


















ఆంధ్రా-19 జట్టు కెప్టెన్‌గా వీరారెడ్డి

• జయంత్‌కృష్ణకు జట్టులో చోటు



అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాకి చెందిన కేహెచ్ వీరారెడ్డికి అరుదైన అవకాశం దక్కింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-19 జట్టు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. మరో ఆటగాడు జయంత్‌కృష్ణకు జట్టులో చోటు కల్పించారు. 2025-26 సీజన్‌లో ఆంధ్రా-19 పురుషుల వన్డే జట్టుకు ఇద్దరు క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించనున్నారు. అనంతపురం నగర డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్‌రెడ్డి తనయుడే కేహెచ్ వీరారెడ్డి. అక్టోబరు 9వ తేదీ నుంచి హరియానాలో నిర్వహించే వినూమన్కడ్ ట్రోఫీకి ఇద రు క్రీడాకారులు ఆంధ్రా-19 జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇద్దరు క్రీడాకారులకు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేత నెల్లూరు జట్టు

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ జంతులూర్ సీజన్-4 విజేతగా నెల్లూరు జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా బీకేఎస్ నైట్‌రైడర్స్ జట్టు నిలిచింది. మండలంలోని జం తులూరు సెంటల్ యూనివర్శిటీ సమీపంలో గల క్రీడా మైదానంలో గత 50 రోజులుగా ని ర్వహించిన టోర్నీలో ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఇన్ని రోజుల పాటు జరిగిన టోర్నీలో కర్ణాటక, ముంబయ్, హైదరాబాద్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన దాదాపు 65 జట్లు పాల్గొన్నా యి. ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యా టింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు నిర్ణీత 14 ఓవర్లలో 186 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన బీకేఎస్ జట్టు 14 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 128 పరుగులు సాధించింది. 58 పరుగులు తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.1.50 లక్షలు, రన్నర్స్ జట్టుకు రూ.75వేల విలువైన చెక్కులను, ట్రోఫీలను టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు పంపిణీ చేశారు. అలాగే ఆయన తన వంతుగా సొంత నిధులు రూ.80 వేలను టోర్నమెంట్‌కు అందజేశారు. టీడీపీ మండల కన్వీనర్ అశోక్, సొసైటీ ఛైర్మన్ కేశన్న, నాయకులు లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, టోర్నీ నిర్వాహకులు పాల్గొన్నారు .



విజేత జట్టుకు చెక్కును అందజేస్తున్న పర్వతనేని శ్రీధర్‌బాబు

కేజీబీవీ ఉద్యోగులకు న్యాయం చేయాలి

అనంతపురం విద్య, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కేజీబీవీలలోని ఉద్యోగులందరికీ రెగ్యులర్ వేతనాలు అందించాలని ఆ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ విజయ్ డిమాండ్ చేశారు. న్యూటౌన్ ప్రభుత్వ బాలుర కాలేజీలో ఆదివారం ఉమ్మడి జిల్లాలోని కేజీబీవీల ఉద్యోగుల సమావేశం జరిగింది. ఇందులో విజయ్ మాట్లాడుతూ.. 14ఏళ్లుగా కేజీబీవీలలో పని చేస్తున్న ఉద్యోగులకు ఇప్పటికీ ఉద్యోగభద్రత లేదన్నారు. సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వలేదన్నారు. సీఎం, విద్యాశాఖామంత్రి స్పందించి న్యాయం చేయాలని కోరారు. లేకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు సాగిస్తామని హెచ్చరించారు. కేజీబీవీల ప్రిన్సిపాళ్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

బుక్కరాయ సముద్రం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురానికి చెందిన టీడీపీ కార్యకర్త ఖలీద్ గత శనివారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న అతన్ని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి ఆదివారం పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు.

ఘనంగా గురజాడ జయంతి

అనంతపురంవిద్య, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహాకవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతిని జిల్లా గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, సిబ్బంది తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ భూమిపూజ చేశారు. హౌసింగ్‌బోర్డులో రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టే బీటీ రోడ్డు, డివైడర్ల నిర్మాణానికి నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పాలకులు నగరంలోని పరిస్థితులను అధ్వాన్నంగా మార్చారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడాదిలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ముఖ్యంగా డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఏఎంసీ ఎస్ఈ రాజశేఖర్, ఇంజనీర్లు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే.


అనంతపురంక్రైం: నూతన కలెక్టర్ ఆనంద్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కలిశారు. కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగాకలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. నగర అభివృద్ధికి తోడ్పాటనందించాలని కోరారు.



డివైడర్లు, బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

11మందిపై కేసు నమోదు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): నంది విగ్రహం చోరీ వ్యవహారిన్ని నిగ్గు తేల్చాలంటూ మండలకేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను ముట్టడించిన ముష్టికోవెల గ్రామానికి చెందిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. ముష్టికోవెల గ్రామస్థులు గత శనివారం పెద్దఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. అమల్లో ఉన్న 30 పోలీస్ యాక్టును ఆ గ్రామస్థులు ఉల్లంఘించారని, ర్యాలీతో నినాదాలు చేసుకుంటూ గుంపుగా పోలీసు స్టేషన్ ముట్టడించి తమ విధులకు అటంకం కల్గించారని, ఇందుకు సంబంధించి వారిపై 11మందిపై కేసు నమోదు చేసి 41ఏ నోటీసు జారీ చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. రెండు వాహనాలను సీజ్ చేశామన్నారు. మరికొంతమందిపై కూడా కేసు నమోదు చేయనున్నట్లు ఆయన చెప్పారు.



ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్న అవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

ఉత్తరాంధ్రకు వాయు 'గండం'

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తు తం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కౌలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రగ్యానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాల్‌త మునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

అబద్ధాలు చెబితే ఆ సీట్లూ ఉండవ్

- మాజీ సీఎం జగన్‌పై ఎమ్మెల్యే దగ్గుపాటి ఫైర్
- రూ.41.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ పదే పదే అపద్ధాలు చెప్పి ప్రజల్ని భయాందోళనకు గురిచేస్తే.. వచ్చే ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా మిగలవని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మండిపడ్డారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో ఆదివారం 33 మందికి రూ.41.50 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్బన్ నియోజకవర్గానికి సీఎం అడిగిన వెంటనే 15 నెలల్లో రూ.3 కోట్లకుపైగా సీఎంఆర్ఎఫ్ సాయం అందించారని తెలిపారు. ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.3,500 కోట్లు పెండింగ్ పెట్టి వెళ్లారంటూ మండిపడ్డారు. జగన్ ప్రభుత్వంలో 17 మెడికల్ కళాశాలలు తీసుకొచ్చారని గొప్పలు చెబుతున్నారని, ఎన్ని నిర్మించారో సమాధానం చెప్పడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి 40 ఏళ్లలో జిల్లాకు ఏమి చేశారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ నాయకులు లలిత్‌కుమార్, పీఎల్ఎన్ మూర్తి, సాకే లక్ష్మీనరసింహ, చేపల హరి, సుధాకర్‌నాయకుడు, రఘు, మున్వర్, సరిపూటి శ్రీకాంత్, రవి, ఇమ్రాన్, రాము, నారాయణస్వామి పాల్గొన్నారు.

'కళారంగానికి వన్నెతెచ్చిన నారాయణస్వామి'



ఎల్‌కేపీ మాజీ కార్యదర్శి నారాయణస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు



కాలభైరవ సంహారం నాటకంలోని ఓ సన్నివేశం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కళారంగానికి వన్నెతెచ్చిన మహనీయుడు గాజుల నారాయణస్వామి అని లలితకళాపరిషత్ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది పద్మజ పేర్కొన్నారు. లలిత కళాపరిషత్ మాజీ కార్యదర్శి, దివంగత గాజుల నారాయణస్వామి 81వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం లితకళాపరిషత్‌లో నిర్వహించిన సభకు గాజుల పద్మజ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత నారాయణస్వామి చిత్రపటానికి రంగస్థల కళాకారులతో కలిసి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జిల్లా కళాకారుల ప్రతిభకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు నారాయణస్వామి ఎనలేని కృషిచేశారని కొనియాడారు. కాలభైరవ సంహారం నాటక ప్రదర్శనతో కళాకారులు ఆకట్టుకున్నారు. అనంతరం కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో పరిషత్ ఉపాధ్యక్షుడు సంగాల నారాయణస్వామి, రామగోవింద్‌సాగర్, సురభి ఆనంద్, అస్లాం బాషా, లోకేష్, ఉంగరాల శ్రీనివాసులు, మల్లెల జయరాం, నారాయణస్వామి బంధుమిత్రులు, కళాకారులు పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడుకుందాం

- రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతలు



సమావేశంలో పాల్గొన్న పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా పేదలకు అండగా నిలుస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)కు అండగా నిలవాలని ఆర్డీటీ అఖిల పక్ష కమిటీ నేతలు నిర్ణయించారు. ఈ మేరకు ఆ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎంపీ రంగయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శంకర్, టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్‌చౌదరితో పాటు సీపీఐ, సీపీఎం, కుల, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ.. ఆర్డీటీ సేవల కొనసాగింపు కోసం కూటమి ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడుతో పాటు, కేంద్ర మంత్రి అమిత్‌షాను ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కలిసి విన్నవించారని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ.. పేదలకు విద్య, వైద్యం, క్రీడలు అనేక రకాల సేవలు అందిస్తున్న ఆర్డీటీని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఆర్డీటీ పేద ప్రజలకు దశాబ్దాలుగా అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. మాజీ ఎంపీ రంగయ్య మాట్లాడుతూ.. పేదలకు కడుపునిండా మెతుకులు అందించే ఆర్డీటీని కాపాడుకోలేకపోతే... వారికి బతుకులు ఉండవని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం దశల వారిగా నిర్వహించే ఉద్యమ కార్యచరణను అఖిలపక్ష కమిటీ నేతలు విడుదల చేశారు. సమావేశంలో నాయకులు మల్లికార్జున, బాలరంగయ్య, వేమన, బీసీఆర్ దాస్, కేపీ నారాయణస్వామి, అక్కులప్ప, సామ్రాట్ మధు, ఆనంద్‌రాజు, భానూజ, రామచంద్ర, నారాయణరెడ్డి, నారాయణప్ప, నరసింహులు, కుళ్లాయిస్వామి, వీరేంద్ర, సుదర్శన్, నాగేష్, మారుతి, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా సీనియర్ మహిళా జట్టుకు ఎంపిక



అనూష



హరిత

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా సీనియర్ మహిళా టీ20 జట్టుకు ఇద్దరు ఎంపికయ్యారు. జిల్లా నుంచి అనూష, హరిత ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సీనియర్ మహిళా టీ20 జట్టులో చోటు సాధించారు. అక్టోబరు 8 నుంచి బరోడాలో నిర్వహించే బీసీసీఐ సీనియర్ ఉమెన్ టీ20 నేషనల్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఆంధ్రా సీనియర్ మహిళా జట్టు తరఫున ఇద్దరు క్రీడాకారిణులు ప్రాతినిధ్యం వహించనున్నారు.

నూర్‌బాషా సంఘం అధికార ప్రతినిధిగా ఉమర్



ఉమర్‌ను సన్మానిస్తున్న సంఘం రాష్ట్ర నేతలు

అనంతపురం ప్రెస్‌క్లబ్/పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నూర్‌బాష, దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా జిల్లాకు చెందిన టీడీపీ యువ నాయకుడు డాక్టర్ ఉమర్ ముక్తార్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం గుంటూరులోని ఓ హోటల్‌లో జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహమ్మద్, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా ఆధ్వర్యంలో ఉమర్ ముక్తార్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పీర్ మహమ్మద్, నాగుల్‌మీరా మాట్లాడుతూ... లైజనింగ్ కమిటీ, కోర్ కమిటీతో పాటు రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉమర్‌ను ఎంపిక చేశామని అన్నారు. అనంతపురం జిల్లా పరిషత్ చైర్మన్‌గా చమన్‌సాబ్ ఎన్నో సేవలు అందించారని గుర్తు చేసుకున్నారు. సంఘం, దూదేకుల కులస్థుల కోసం ఆయన అహర్నిశలు శ్రమించారని అన్నారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా ఉమర్ రాజకీయ అరంగ్రేటం చేసి సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. దూదేకుల సంక్షేమ సంఘం తరఫున ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలో పర్యటించి దూదేకుల ఓటర్లను కూటమి వైపు నడిపించడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రలో తనవంతు పాత్ర పోషించారని అన్నారు. ఉమర్ ముక్తార్ మాట్లాడుతూ.. తన తండ్రి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా నూర్‌బాష, దూదేకుల సంఘం అభివృద్ధి కోసం పాటుపడతానని తెలిపారు. అనంతరం ఉమర్‌ను సంఘం రాష్ట్ర, జిల్లా నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారుడు డాక్టర్ బాబన్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి షేక్ సలీం, కోశాధికారి డాక్టర్ పర్ల దస్తగిరి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ మస్తానమ్మ, నాయకులు లాల్ వజీర్, సాయిబాబా, డీఎస్పీ మహబూబ్ బాషా, రిటైర్డ్ తహసీల్దార్ షేక్షావలి, నాగూర్, ఆదాం షఫీ, దిల్షాద్, రజియా, ఖాజావలి, షేక్ మస్తాన్, షరీఫ్, ఇబ్రహీం, ఖాసీం, ఆరీఫ్, మహబూబ్ బాష, ఇమాములు, బాష, చాంద్ బాషా పాల్గొన్నారు.

సీమ కళాకారులకు సత్కారం

- అక్టోబరు 28న ఎన్టీఆర్ శత జయంతి వేడుక
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం



అనంతపురం క్రైం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తెలుగు పౌరుషానికి ప్రతీకగా నిలిచిన నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో వచ్చే అక్టోబరు 28న రాయలసీమ స్థాయిలో వేడుక నిర్వంచనున్నట్లు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శత జయంతి ఉత్సవల కమిటీ గతంలో ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం శత జయంతి వేడుకల నేపథ్యంలో వచ్చేనెల 28న అనంతపురం శిల్పారామంలో గొప్ప వేడుక నిర్వహించబోతున్నామని అన్నారు. రాయలసీమ జిల్లాలకు చెందిన సినీ రంగ కళాకారులు, ఎన్టీఆర్ కుటుంబికులు, సీఎం చంద్రబాబు, నారా లోకేష్‌ను ఆహ్వానించి పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించబోతున్నామనారు. సీమ జిల్లాల్లో ఎన్టీఆర్‌తో సమకాలికులుగా ఉన్న వారిని, రచయితలుగా, గాయకులుగా, డైరెక్టర్లుగా, ఆర్టిస్టులుగా రాణించిన వారిని ఆహ్వానించి సన్మానిస్తున్నామని తెలిపారు. సామాజిక హితం కోసం ఎన్టీఆర్ ఎన్నో కార్యక్రమాలు చేశారని, ఆయనతో తనకు ఉన్న సాన్నిహిత్యం మూలంగా ఈ కార్యక్రమం నిర్వహించబోతున్నామని అన్నారు. త్వరలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవ కమిటీలు వేసి, వేడుకను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు.

చరిత్రలో నిలిచిపోనున్న సత్యనారాయణ రచనలు

- సాహితీవేత్త డాక్టర్ శాంతినారాయణ



'అక్షర విన్యాసములు', 'గేయములు - పాటలు' పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ విశ్రాంత ఉపసంచాలకుడు, కవి అగ్రహారం సత్యనారాయణ రచించిన 'అక్షర విన్యాసములు', 'గేయములు-పాటలు' పుస్తకాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని సాహితీవేత్త డాక్టర్ శాంతినారాయణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించిన 'అక్షర విన్యాసములు', 'గేయములు-పాటలు' పుస్తకాల ఆవిష్కరణకు శాంతినారాయణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సత్యనారాయణ రచించిన ఈ రెండు పుస్తకాలు ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరం అన్నారు. సత్యనారాయణ తన జీవిత కాలంలో అనుభవించిన, చూసిన అనుభవసారాన్ని, సంగీత జ్ఞానాన్ని పుస్తకాలుగా తీసుకురావడం శుభపరిణాం అన్నారు. రచయిత సత్యనారాయణ మాట్లాడుతూ... తిమ్మాపురం సేవామందిరం స్కూల్‌లో టీచర్లు చూపిన బాటే తన రచనలకు మార్గనిర్దేశం అన్నారు. ఈ రెండు పుస్తకాలను తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి తెలుగు టీచర్‌కు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు తూముచర్ల రాజారామ్, అంకె శ్రీనివాస్, అడవాల శేషగిరి నాయుడు, నరసింహులు, అచ్చన్న, గంగన్న, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కుమ్మర శాలివాహన డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం


వెంకటసుబ్బయ్యను సన్మానిస్తున్న ఈశ్వర్

తాడిపత్రి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె గ్రామానికి చెం దిన కుమ్మర వెంకటసుబ్బయ్య కుమ్మర శాలివాహన సంఘం డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. శనివారం విజయవాడలోని బీసీ భవన్‌లో ఆయనతో కుమ్మరశాలివాహన సంఘం చైర్మన్ ఈశ్వర్ ప్రమాణస్వీకారం చేయించారు. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డీసీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శాలివాహనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు

వ్యక్తిపై కేసు నమోదు

గుత్తి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై పట్టణానికి చెందిన చౌదరి సోషల్ మీడియాలో ఇటీవల అనుచిత వ్యాఖ్యలు చేశాడు. దీంతో అతనిపై జనసేన పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు చిన్న వెంకటేశులు, సురేష్ ఎస్ఐ సురేష్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. చౌదరిపై 196బీ ఎన్ఎస్, 35(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కలు నాటిన డీఆర్ఎం


మొక్క నాటి నీరు పోస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే పరిసరాలు, కార్యాలయాల ఆవరణల్లో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా ఆదివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీనియర్ డీసీఎం ఎస్ మనోజ్, సీనియర్ డీఓఎం ఎం శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

అమావాస్య ప్రత్యేక పూజలు



కణేకల్లు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహాలయ అమావాస్య సందర్భంగా మండలంలోని పలు ఆలయాలలో ఆదివారం ప్రత్యేకపూజలను నిర్వహించారు. పితృపక్షానికి సంబంధించిన అమావాస్య కావడంతో పలువురు పెద్దల ఫోటోలకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే చిక్కణ్ణేశ్వర ఆలయంలో విశేషపూజలు నిర్వహించిన.. అన్నసంతర్పణ చేశారు.

గురజాడ అప్పారావుకు నివాళి

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్‌జీఓ భవనంలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఇందులో జేవీవీ అధ్యక్షుడు శివానంద, కార్యదర్శి నాగరాజు, జేవీవీ గౌరవ అధ్యక్షుడు వీరేష్, ఎన్‌జీఓ అధ్యక్షులు కెంచె లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అందని గోకులం బిల్లులు

తొమ్మిది నెలలుగా లబ్ధిదారుల నిరీక్షణ


గోకులం షెడ్డును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

యాడికి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గోకులం పథకం కింద మొదటివిడతగా మండలంలో 32 మంది పాడి రైతులకు షెడ్లు మంజూరయ్యాయి. షెడ్ల నిర్మాణ పనులు పూర్తిచేయడమే ఆలస్యం వెంటనే మీకు బిల్లులు చెల్లిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో లబ్ధిదారులు చకచకా షెడ్ల నిర్మాణ పనులు పూర్తిచేశారు. కొందరు అప్పులు చేసి.. మరీ షెడ్లను నిర్మించుకున్నారు. సంక్రాంతి పండుగ రోజున అధికారులు, నాయకులు వెళ్లి గోకులం ఆయా షెడ్లను అట్టహాసంగా ప్రారంభించారు. అయితే ఆ 32 మందిలో 22 మందికి బిల్లులు మంజూరు కాగా.. 10 మందికి మాత్రం నేటికీ బిల్లులు మంజూరు కాకపోవడంతో వారు లబోదిబోమంటున్నారు. అధికారులు చర్యలు చేపట్టి ఆ బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని వారు కోరుతున్నారు. దీనిపై ఉపాధిహామి పథకం ఏపీఓ చిన్నమద్దిలేటిని వివరణ కోరగా.. 'మండలంలో పదిమంది గోకులం షెడ్ల లబ్ధిదారుల బిల్లులు రిజెక్ట్ అయ్యాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాను. వీటిని అన్నింటిని మరళా అప్‌లోడ్ చేశాము. నిధులు విడుదల అయిన వెంటనే బిల్లులు మంజూరు అవుతాయి. సమస్య పరిష్కారం మా పరిధిలో లేదు. లబ్ధిదారులకు వీలైనంత తొందరగా బిల్లులు మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టాం.' అని తెలిపారు.

హౌసింగ్ కార్యాలయం మూత



విడపనకల్లు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్ కార్యాలయాన్ని ఎప్పుడు తెరుస్తారో.. ఎప్పుడు మూస్తారో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. విడపనకల్లు హౌసింగ్ ఏఈగా శేఖర్ దాదాపు ఒకటిన్నర సంవత్సరం క్రితం బాధ్యతలు చేపట్టారు. అయితే ఆయన ఎప్పుడూ విధులకు హాజరుకాలేదు. ఆ అధికారిని ఇంతవరకూ మండల వాసులు చూసిందే లేదు. కేవలం కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే కార్యాలయానికి వచ్చి.. వెళ్లేవారు. వారం రోజులుగా ఆమె కూడా రాకపోవడంతో కార్యాలయం మూతపడింది. దీనిపై హౌసింగ్ డీఈ అనుమప్పను వివరణ కోరగా.. 'ఏఈ శేఖర్ రోజూ విధులకు హాజరవుతున్నట్లు చెప్పారు. కానీ అతను కార్యాలయానికి రావటం లేదనే విషయం మాకు ఇప్పుడే తెలిసింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అతనిపై విచారించి.. చర్యలు తీసుకుంటాం. విడపనకల్లులో హై ఓల్టేజి కారణంగా కంప్యూటర్ కాలిపోయింది. దీంతో కంప్యూటర్ ఆపరేటర్ ఉరవకొండలోని డీఈ కార్యాలయంలో ఉంటూ కంప్యూటర్ పనులు చేస్తోంది.' అని తెలిపారు.

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలు ప్రారంభం

● పాల్గొన్న 17 జిల్లాల క్రీడాకారులు ● హోరాహోరీగా సాగిన పోటీలు


మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న క్రీడాకారులు

ఉరవకొండ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి 28వ సబ్ జూనియర్ సెపక్ తక్రా పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని 17 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఆ క్రీడాకారులు మార్చ్ పాస్ట్ నిర్వహించారు. అనంతరం క్రీడా జెండాను ఎగురవేసి, క్రీడా జ్యోతిని వెలిగించారు. డీఎస్‌డీఓ మంజుల, సెపక్‌తక్రా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఉరవకొండలోనే రెండుసార్లు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిచామన్నారు. అనంతరం వివిధ జిల్లాల క్రీడాకారులు పోటీల్లో తలపడ్డారు. ఈ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. కార్యక్రమంలో హెచ్ఎం రాజేశ్వరి, కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఎంఈఓ ఈశ్వరయ్య, సెపక్ తక్రా జిల్లా సంఘం చైర్మెన్ మల్లికార్జున, అధ్యక్షుడు షాహిన్, అనంతపురం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు నాగరాజు, సత్యసాయి జిల్లా స్కూల్ గేమ్స్ మాజీ కార్యదర్శి మొరార్జీ, వ్యాయామ ఉపాధ్యాయుడు మారుతి, రాఘవేంద్ర, నాగరాజు, మంజునాథ్, జనార్దన్, శివకుమార్ పాల్గొన్నారు.

వాసవీ మాత ఫ్లెక్సీ చింపివేత

బీజేవైఎం నాయకులపై ఆర్యవైశ్యుల ఫిర్యాదు


చిరిగిన అమ్మవారి ఫ్లెక్సీ

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయం ఎదుట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాసవి అమ్మవారి ఫ్లెక్సీని బీజేవైఎం నాయకులు ఆదివారం రాత్రి బ్లేడ్‌తో కోసివేశారు. అడ్డుకోపోయిన ఆర్యవైశ్య సంఘం నాయకులను దుర్భషలాడారు. దీన్ని నిరసిస్తూ ఆర్యవైశ్య సంఘం నాయకులు పెద్ద ఎత్తున వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపాజగదీష్ మాట్లాడుతూ... ఆ ఫ్లెక్సీలో వాసవీ మాత ఫొటో చిన్నదిగా వేసి.. ఆయిల్ కంపెనీకి చెందిన ఆడ్వర్టైజ్ ఎక్కువగా ఉందంటూ బీజేవైఎం నాయకులు కేశవ, చక్రపాణి మరో నలుగురు ఆ ఫ్లెక్సీని చించివేశారన్నారు. అడ్డుకోపోయిన తమ సంఘం నాయకులను దుర్భషలాడారన్నారు. ఫ్లెక్సీని చింపిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఫ్లెక్సీని చించివేసిన కేశవతో పాటు మరో యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆలయ ఎదుట ఆర్యవైశ్య సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ మనోహర్ ధర్నా వద్దకు చేరుకుని ఆర్యవైశ్య సంఘం నాయకుల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.


సీఐతో చర్చిస్తున్న ఆర్యవైశ్యసంఘం నాయకులు

చదువుకున్న పాఠశాలలకు చేయూత


టెన్త్ మెటీరియల్‌తో విద్యార్థులు, ఉప్పర శ్రీనివాసులు

బెళుగుప్ప, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులెన్న గ్రామానికి చెందిన ఉప్పర శ్రీనివాసులు ప్రస్తుతం యలగలవంక పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఆయన తన సొంతూరైన ఆవులెన్నలోని ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి వరకు, వెంకటాద్రిపల్లి ఉన్నత పాఠశాలలో 7వ తరగతి వరకు, బెళుగుప్ప ఉన్నత పాఠశాలలో 8 నుంచి 10 వరకు చదువుకున్నారు. స్వగ్రామంలోని పాఠశాలలో మొక్కలు నాటించారు. వెంకటాద్రిపల్లి, బెళుగుప్ప ఉన్నత పాఠశాలల్లోని టెన్త్ విద్యార్థులకు ఉచితంగా టెన్త్ మెటీరియల్‌ను అందజేశారు. బెళుగుప్ప ఉన్నత పాఠశాలకు గ్రిల్ నిర్మాణానికి రూ.5వేలు అందజేశారు.

రోడ్డుకు మరమ్మతులు


రోడ్డును చదును చేస్తున్న సిబ్బంది

ఉరవకొండ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ-ఇంద్రావతి రోడ్డు వర్షానికి గుంతలు పడి అధ్వానంగా తయారైంది. విషయాన్ని స్థానిక టీడీపీ నాయకులు మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి హంద్రీనీవా కాలువ నిర్మాణం కాంట్రాక్టర్లతో మాట్లాడి.. తాత్కాలికంగా రోడ్డుపై మట్టి తోలించి, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేయాలని సూచించారు. దీంతో ఆదివారం ఎక్స్‌కవేటర్ సాయంతో మట్టి తోలి.. రోడ్డును బాగు చేశారు.

నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు

యాడికి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దమ్మ ఆలయంలో సోమవారం నుంచి దసరా శరన్నవరాత్రులను నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు, కమిటీ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా రోజుకొక అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారన్నారు.

● గుంతకల్లుటౌన్ : స్థానిక శ్రీ మారెమ్మ, కొల్హాపూర్ మహాలక్ష్మి, చాముండేశ్వరి, రేణుకా ఎల్లమ్మ, చౌడేశ్వరి, కనకదుర్గ, కాళికామాత ఆలయాల్లో శరన్నవ రాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయి. ఈ 11 రోజులు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు.

● తాడిపత్రి : స్థానిక అమ్మవారిశాలలో దసరా పండుగ సందర్భంగా సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తలుపుల సురేంద్రనాథ్ ఆదివారం తెలిపారు.

విద్య, నైపుణ్యాలపై అవగాహన సదస్సు

తాడిపత్రి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక పద్మవాణి పాఠశాలలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో విద్య, నైపుణ్యాలపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఆ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు వెన్నపూస బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కులు, ర్యాంకుల వెంబడి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరుగులు తీస్తున్నారని, డబ్బులు సంపాదించే యంత్రాల్లా విద్యార్థులు తయారవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోలేని విధంగా విద్యార్థులు తయారవుతున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నాగపీరయ్య, జేవీవీ కార్యనిర్వాహక అధ్యక్షులు రమణయ్య, గోపాల్, ప్రధానోపాధ్యాయుడు మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలపై దృష్టి

సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ చేతనానంద్ సింగ్


మాట్లాడుతున్న సీనియర్ డీజీఎం చేతనానంద్ సింగ్

గుంతకల్లు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్లు, రైళ్లలో ప్రయాణికులకు మౌలిక సదుపాయాలను కల్పించే విషయంగా ప్రత్యేక దృష్టిపెట్టాలని దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజరు చేతనానంద్ సింగ్ పేర్కొన్నారు. శనివారం రాత్రి గుంతకల్లు రైల్వే డివిజనల్ కేంద్రానికి వచ్చిన ఆయన డీఆర్ఎం కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. అధికారులు జవాబుదారీతనంతో పనిచేసినప్పుడే ప్రజలకందించే సేవల్లో కచ్చితత్వం సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్ఎం సుధాకర్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


నగదు అందజేస్తున్న దివాకర్‌రెడ్డి

పెద్దవడుగూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వీరభద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ దివాకర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి తనవంతు సహాయంగా రూ.50 వేలను ఆలయ కమిటీ సభ్యులు సుంకిరెడ్డి, ప్రతాప్‌రెడ్డికి అందజేశారు.

26న కంటి వైద్య శిబిరం

గుత్తి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక విరూపాక్షరెడ్డి హాల్‌లో కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో దీన్ని నిర్వహిస్తున్నామని, ఉచితంగా కంటిలో శుక్లం ఉన్న వారికి పరీక్షలు, పేదవారికి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ నిర్వాహకులు తెలిపారు.

మండలంలో భారీ వర్షం

బొమ్మనహాళ్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన వర్షంతో గ్రామాల్లో పలు కాలనీలు జలమయమయ్యాయి. మండలంలోని ఉంతకల్లు గ్రామంలోని ఎన్టీఆర్ కాలనీలో భారీ స్థాయిలో నీరు నిల్వ ఉండిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గ్రామంలో మురుగుకాలువలు లేకపోవడంతో వర్షం పడిన ప్రతిసారీ ఈ కాలనీలో నీరు నిలుస్తోందని స్థానికులు వాపోతున్నారు. పత్తి పంట పొలాల్లో నీరు నిలిచిపోవడంతో మొక్కలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● కణేకల్లు : మండల వ్యాప్తంగా ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వర్షం రాకతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. భారీ వర్షంతో వేదావతి హగరికి భారీగా నీరు చేరింది. ఇటీవల వర్షాలతో పలు చెరువుల్లో నీరు చేరడంతో.. భూగర్భజలాలు పెరిగి.. బోరుబావులలో పుష్కలంగా నీరు లభిస్తోంది.


ఉంతకల్లులో ఎన్టీఆర్ కాలనీ దుస్థితి



కణేకల్లులో కురుస్తున్న వర్షం

క్రైం న్యూస్..

చికిత్స పొందుతూ మహిళ మృతి

గుత్తి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ కాలనీ వాసి సమీర్ భార్య మౌనిక (23) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించింది. మౌనిక కుటుంబ కలహాలతో సమీర్‌తో గొడవ పడి శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఆమెను కర్నూల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. కోలుకోలేక ఆమె మరణించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేకులకుంట గ్రామానికి చెందిన ఎల్లక్క (68) శనివారం రాత్రి ప్రమాదవశాత్తు చెరువులోకి జారిపడి మరణించింది. గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లిన ఆమె... ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మరణించింది. ఆమెకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

ఎలుగుబంటి దాడిలో ఇద్దరికి గాయాలు

గుమ్మఘట్ట,సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరిగేదొడ్డి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులపై ఆదివారం ఉదయం ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. రామాంజనేయులు, చంద్ర అడిగుప్ప కొండలో సీతాఫలం పండ్లు కోసేందుకు వెళ్లగా... పొదల్లో దాగి ఉన్న ఎలుగుబంటి ఒక్కసారిగా వారిపై దాడి చేసి గాయపరిచింది. వారు కేకలు వేయడంతో పరిసరాలలో ఉన్న వారు అక్కడికి వెళ్లేలోగా ఎలుగుబంటి పారిపోయింది. గాయపడిన వారిని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చీనీ చెట్ల నరికివేత


నరికేసిన చీనీ చెట్టు

బెళుగుప్ప, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విరుపాపల్లి హరికృష్ణకు చెందిన తోటలో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి 75 చీనీచెట్లను నరికివేశారు. రైతు హరికృష్ణ, తండ్రి వెంకటేశులు మాట్లాడుతూ.. నాలుగేళ్ల క్రితం 500 చీనీ చెట్లు వేశామని, అందులో 75 చెట్లను నరికివేశారని వాపోయారు. కొన్ని నెలలకు పంట చేతికొస్తుందని ఆశతో ఉండగా చెట్లని నరికివేశారని కన్నీటి పర్యంతమయ్యారు. సీఐ మహానంది, ఎస్ఐ శివ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

శ్మశాన వాటిక ఆక్రమణపై వాగ్వాదం

పెద్దవడుగూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవడుగూరు గ్రామంలో 111 సర్వేనెంబర్‌లో 3.33 ఎకరాల్లో శ్మశాన వాటిక ఉంది. ఇది ప్రభుత్వ రికార్డుల్లో వాగు భూమి ఉంది. గ్రామంలోని కొందరు వ్యక్తులు రెండు ఎకరాలను ఆక్రమించున్నారు. ఆ భూమిలోని ఆక్రమణను తొలగించేందుకు మరో వర్గం వారు ఆదివారం వెళ్లారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వారికి నచ్చజెప్పారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు.

విజేతలకు అభినందన సభ


బహుమతులతో విజేతలు, నిర్వాహకులు

కుందుర్పి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులను, కొత్తగా ప్రభుత్వ ఉద్యోగులుగా ఎంపికైన పోలీసు కానిస్టేబుళ్లకు సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్ బాబు ఆదివారం అభినందన సభను నిర్వహించారు. వీరిని సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ శైలజ అభినందించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ మురళీధర్ రావు, కుందుర్పి మండల విద్యాశాఖాధికారి తిప్పేస్వామి, రచయిత్రి రమాదేవి విజేతలకు బహుమతులు అందజేశారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


కార్యక్రమంలో పాల్గొన్న మంజుల వెంకటేష్, విద్యార్థులు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆ నలుగురు సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్ సూచించారు. స్థానిక బీసీ బాలుర హాస్టల్‌లో ఆదివారం ఆ సమితి ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ ఫర్ 2047 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సమితి ఉపాధ్యక్షుడు చక్రపాణి, కేశవ, సభ్యులు కురువ పురషోత్తం, ఆటో వేణు, మహేష్, లింగేశ్వర్, బాబు, శ్రీనివాస్, స్నేహ, అంజలి, రతమ్మ పాల్గొన్నారు.

రిజర్వాయర్‌కు 2,099 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,099 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2,059 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు ఆదివారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.718 టీఎంసీలు నీరు ఉందని తెలిపారు.